తెలిసిన వెంటనే స్పందించారు!

ప్రమాదకరంగా మారిన భారీ చెట్లు, కొమ్మలను తొలగించిన డీఆర్‌ఎఫ్ బృందం

సాక్షి ఎఫెక్ట్..



చిక్కడపల్లి: ఎప్పుడు నేలకూలుతాయో.? అనే శీర్షికతో మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్, హార్టికల్చర్ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఎన్టీఆర్ స్టేడియం పక్కన ఉన్న 31 ఎల్‌ఐసీ కాలనీ రోడ్డులో ఓ ఇంటిగోడపై పడిన భారీ చెట్టు, కొమ్మలను తొలగించారు. గాంధీనగర్ డివిజన్‌తో పాటు అన్ని డివిజన్లలో ప్రమాదకరంగా మారిన చెట్ల వివరాలను లిఖిత పూర్వకంగా ఉత్తరం, ఫారెస్ట్, హార్టికల్చర్ అధికారులు ఇవ్వాలని కార్పొరేటర్ ఎ.పావని సూచించారు. వీధి దీపాలకు అడ్డంగా ఉన్న కొమ్మలను కూడా కొట్టేసేందుకు విరిగిపోయిన ప్రమాదకరంగా మారిన చెట్లను తొలగించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. అంతేకాకుండా కొన్ని రోజులుగా ఉన్న చెట్టు కూలి గోడపై ఆగిన కొమ్మలను తొలగించి పెను ప్రమాదం తొలగిపోయింది. అప్పుడే వర్షం, గాలి దుమారం వల్ల ఎన్టీఆర్ స్టేడియం అక్కడ పిల్లలు ఆడుకుంటారని వారిపైన పడితే ప్రమాదం జరిగేది. ఈ సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన 'సాక్షి'కి, అధికారులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.





దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తా



మారుతీనగర్‌లోని భూలక్ష్మి - నాగదేవత ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే

అంబర్‌పేట: దేవాలయాలు మనలో ఆధ్యాత్మికతను పెంచడంతో పాటు మానసిక ప్రశాంతతను ఇస్తాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. మంగళవారం గోల్నాక మారుతీనగర్‌లోని భూలక్ష్మి - నాగదేవత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దంపతులు భక్తులతో కలిసి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నం వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

అన్నదానం.. మహాదానం

కాచిగూడ: 'అన్నదానం.. మహాదానం'అని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా అన్నారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, అరవింద్, శీర్‌సాగర్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు జీతాలు పెరుగుతాయి..
మా స్కాలర్‌షిప్‌లు పెరగవా.?

కాచిగూడ: పెరిగిన ధరలకనుగుణంగా 16లక్షల మంది విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రూ.5500 నుంచి రూ.20వేలకు పెంచాలని డిమాండ్‌తో మంగళవారం కాచిగూడలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి అవంతి కాలేజీ బర్కత్‌పుర చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్తూ నినాదాలు చేశారు. ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉద్యోగులు, అధికారుల జీతాలు పెరుగుతాయి కాని మా స్కాలర్‌షిప్స్ పెంచరా..? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్కాలర్‌షిప్ నిధులు, ఫీజు బకాయిలు రూ.4వేల కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, బీసీ నేతలు నీల వెంకటేష్, నిమ్మల వీరన్న, ఉదయ్ నేత, నందగోపాల్, పగిళ్ల సతీష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోతులు, వీధి కుక్కల బెడదను నివారించండి



వెటర్నరీ విభాగం అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ బి.పద్మా

అంబర్‌పేట: బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో కోతులు, వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని.. ఈ సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి మంగళవారం వెటర్నరీ విభాగం అధికారులకు సూచించారు. వెటర్నరీ అధికారులు డా. సుద్దుణరెడ్డి, డా. వనజకుమారి, సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రధానంగా డీడీకాలనీ, సీఈ కాలనీ ప్రాంతాల్లో కోతులు బెడద తీవ్రంగా ఉందని ఆమె వారికి వివరించారు. అలాగే తురాబ్‌నగర్, బతుకమ్మ కుంట, మల్లికార్జున నగర్ తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉందన్నారు. ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని జాప్యం లేకుండా వీధి కుక్కలు, కోతుల బెడదను నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, చంద్రమోహన్, గోవింద్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి నాయిని నర్సింహారెడ్డి



లంబాడీ తండాలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, వి.శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్ జోన్ బృందం: తెలంగాణ పోరాట యోధుడు, రాష్ట్ర తొలి హోంశాఖమంత్రి నాయిని నర్సింహారెడ్డి వర్ధంతి మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, నాయిని అల్లుడు వి.శ్రీనివాస్‌రెడ్డి, కుమారుడు దేవేందర్‌రెడ్డి, అభిమానులు, బీఆర్‌ఎస్ నాయకులు రాంనగర్ చౌరస్తాలోని అమరవీరుల స్తూపం వద్ద నాయిని నర్సింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదల పక్షపాతి నాయిని నర్సింహారెడ్డి అని కొనియాడారు. ముషీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ప్రతి కార్యకర్త గుర్తుంచుకునేలా ఆయన సేవలు కొనసాగాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బాగ్‌లింగంపల్లిలోని లంబాడ బస్తీలో జరిగిన కార్యక్రమంలో నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయిని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు వి.సమతారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఎంఎన్ శ్రీనివాస్‌రావు, ముఠా జైసింహ, నాగేష్ ముదిరాజ్, రేషం మల్లేష్, గోపి, బాలయ్య, శివ, మధు, రాకేష్‌కుమార్, ముఠా నరేష్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నవయుగ భగీరథుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య

- దేశం గర్వించదగ్గ ఇంజినీర్ విశ్వేశ్వరయ్య
- ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావు



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న త్రినాథరావు

చిక్కడపల్లి: మోక్షగుండం విశ్వేశ్వర య్య భారతదేశం గర్వించదగ్గ ఇంజనీర్ అని ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావు అన్నారు. మంగళవారం త్యాగరాయగానసభ నిర్వహణలో నవయుగ భగీరథుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య యాదిలో శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ.. విశ్వేశ్వరయ్య కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలలో ప్రాజెక్టుల రూపకల్పన చేసి నీటి వనరులను ప్రజలకు అందించిన మహనీయుడని అన్నారు. ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ... తన ప్రణాళికతో ప్రపంచస్థాయిలో ఎన్నో కట్టడాలను నిర్మించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు శ్రీమణి, జి.గీతాదేవిలు పాల్గొన్నారు.

తిండికి ధోకా లేదు
టీచర్ల భర్తీ లేదు

- చిన్నారుల శారీరక ఎదుగుదలకు పౌష్టికాహారం ఉంది
- మానసిక ఎదుగుదలకు చదువు చెప్పేవాళ్లు లేరు
- కొన్ని కేంద్రాల్లో టీచర్ల కరువు.. మరికొన్నిట్లో హెల్పర్లు లేరు
- అన్ని తామై వ్యవహరిస్తున్న అంగన్‌వాడీ ఆయాలు
- పలు ప్రాంతాల్లో సహాయకులతో నెట్టుకొస్తున్న యంత్రాంగం

అలంకారప్రాయంగా అంగన్‌వాడీ కేంద్రాలు



బండమైసమ్మనగర్ కమ్యూనిటీహాల్‌లో అంగన్‌వాడీ కేంద్రం

కవాడిగూడ: చిన్నారుల్లో శారీరక, మానసిక అభివృద్ధితో పాటు పూర్వ ప్రాథమిక విద్య అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డవలప్‌మెంట్ సర్వీస్) ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు అలంకారప్రాయంగా మారుతున్నాయి. పోషకాహారం అందిస్తున్నా చిన్నారులకు విజ్ఞానం అందించడంలో మాత్రం అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చలేకపోతున్నాయి.

ఇక్కడ టీచర్లు లేక..

హిమాయత్‌నగర్ సెక్టార్ పరిధిలో 20 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి అచ్చయ్యనగర్-1, శ్రీరాంనగర్, అచ్చయ్యనగర్-2, బాగ్‌లింగంపల్లి, సూర్యానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్లు లేరు. ఆయమ్మలే అన్నీ చూసుకుంటున్నారు. దీంతో అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టికాహారం అందుతుందే తప్పా విజ్ఞానం అందడం లేదు.

ఇక్కడ హెల్పర్లు లేక..

ఎంసీహెచ్ క్వార్టర్స్, హుందాబాగ్, బాగ్‌లింగంపల్లి, ఎల్చిగూడ, పూల్‌బాగ్, శ్రీరాంనగర్, బస్తీలలో ఉన అంగన్‌వాడీలలో హెల్పర్లు లేకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆ దిశగా చర్యలు తీసుకోని అధికారులు..

రెండున్నర ఏళ్ల నుంచి 5 సంవత్సరాల వయసు ఉన్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్చుకొని వారికి ఆటాపాటలతో పాటు చదువు చెప్పాలి. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఖాళీలను సంవత్సరాల తరబడి భర్తీ చేయడం లేదు. దీంతో ఆయా కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం మాత్రమే లభిస్తోంది. మనోవిజ్ఞానానికి సంబంధించిన పాఠాలు మాత్రం అందడం లేదు.

భర్తీకి ఉన్నతాధికారుల సన్నాహాలు

హిమాయత్‌నగర్ సెక్టార్‌లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయడానికి జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా సంక్షేమ అధికారి నేతృత్వంలో సన్నాహాలు జరుగుతున్నాయి. త్వరలో భర్తీ చేసే అవకాశం ఉంది.

– సూపర్‌వైజర్ బాల

ఓయూ కొత్త వీసీకి శుభాకాంక్షలు

ముషీరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ నూతన వైస్‌చాన్సలర్‌గా నియమితులైన ప్రొ. కుమార్‌ను మంగళవారం పీడీఎస్‌యూ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి విద్యారంగం సమస్యలను వివరించారు. యూనివర్సిటీలో ప్లేస్‌మెంట్స్ కల్పించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి సుమంత్, స్టేట్ గర్ల్స్ కన్వీనర్ కె.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు నుంచి కింద పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ దూద్‌బౌలికి చెందిన సయ్యద్ అస్లాం (70) ఈనెల 20వ తేదీన సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ నుంచి మలక్‌పేటకు రైలులో వెళ్తుండగా మలక్‌పేట వద్ద రైలు నుంచి కిందపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అతడి కుమారుడు సయ్యద్‌గౌస్ ఫిర్యాదు మేరకు కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలులో మహిళ బ్యాగ్ చోరీ

కాచిగూడ: రైల్లో ఓ మహిళ బ్యాగు చోరి పై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన మంగమ్మ (38) అహ్మదాబాద్ నుంచి కాచిగూడకు రైల్లో వస్తుండగా మొత్కెడ్-నాందేడ్ రైల్వేస్టేషన్ దగ్గర మంగమ్మ బ్యాగ్ చోరికి గురైంది. బ్యాగులో మూడున్నర తులాల బంగారు గోలుసు, రూ.5వేల నగదు, ఐఫోన్ ఉంది. కాచిగూడ రైల్వే పోలీసులకు మంగళవారం ఆమె ఫిర్యాదు చేసింది. రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్ అమలు చేయొద్దు

డీబీపీ జాతీయ అధ్యక్షుడు కృష్ణ స్వరూప్



కాచిగూడ: ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌ను అమలు చేయొద్దని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ప్రభుత్వ క్యాబినెట్ సబ్‌కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖను పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ, క్రిమిలేయర్ అమలు జరిగితే మొత్తం దళిత జాతులకు నష్టం జరుగుతుందన్నారు. వర్గీకరణ చేయమని సుప్రీంకోర్టు తీర్పులో ఎక్కడా పేర్కొనలేదని తెలిపారు. అయితే క్రిమిలేయర్‌ను సుప్రీం కోర్టు రద్దు చేయలేదన్నారు. దీంతో విద్యా, ఉద్యోగ అవకాశాలు ఎస్సీ, ఎస్టీలు కోల్పోతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు, జేఎస్ రావు, పబ్బతి శ్రీకృష్ణ, రోజా లీలా, ఎస్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

ముషీరాబాద్: ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, ఖరీఫ్ సీజన్‌కు రైతు భరోసా, అన్ని పంటలకు రూ.500 బోనస్ చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు ఈనెల 25 నుంచి 31వ తేదీ వరకు మండల, జిల్లా కేంద్రాల్లో ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు. మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన రైతు సంఘం సమావేశంలో సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి, ఉపాధ్యక్షులు రాము, ఎస్‌కే గౌస్, సహాయ కార్యదర్శులు దేవారామ్, భిక్షం, సీహెచ్ రాంచందర్, ఎస్.సురేష్, ఆవుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనానికి రావాలి..



రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ మంగళవారం భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన సదర్ సమ్మేళనానికి రావాలని ఆహ్వానించినట్లు అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు.

– ముషీరాబాద్

కలకత్తా హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



ముషీరాబాద్: కలకత్తాలో మహిళా డాక్టర్‌పై హత్యాచారం జరిగి 72 రోజులు గడుస్తున్నా నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ అన్నారు. పార్సిగుట్ట, అంబర్‌నగర్‌లో ఇఫ్టు, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సీబీఐ దర్యాప్తు సత్వరం పూర్తి చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో అరుణ, రాజమణి, మణక్క, సుజాత, పుష్పలీలా, మంజుల, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణనలో వడ్డెరులను పరిగణలోకి తీసుకోవాలి

చిక్కడపల్లి: బీసీ కులగణనలో సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులతో పాటు సంచారులైన వడ్డెరులను పరిగణలోకి తీసుకోవాలని వడ్డెరుల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ వైస్‌చైర్మన్ ఎత్తరి అంతయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌ను కార్యాలయంలో ట్రస్ట్ డైరెక్టర్ ఓర్సు కృష్ణయ్యతో కలసి ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వడ్డెరులు సంచార జీవులని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి జీవనోపాధికి వెళ్తుంటారని అన్నారు. కులగణన చేసేటప్పుడు వారిని పరిగణలోకి తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంతరావు, మోహన్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాల సృష్టికర్త ఎస్‌ఆర్ శంకరన్

చిక్కడపల్లి: ఎస్‌ఆర్ శంకరన్ గురుకుల విద్యాలయాల సృష్టికర్త అని కమర్షియల్ ట్యాక్స్ రిటైర్డ్ అడిషనల్ కమిషనర్ వై.సత్యనారాయణ కొనియాడారు. మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమీలో నిర్వహించిన ఎస్‌ఆర్ శంకరన్ జయంతి ఉత్సవాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎస్ఆర్ శంకరన్ స్ఫూర్తిదాత, ఆదర్శనీయుడని అన్నారు. నక్సలైట్లు, ప్రభుత్వానికి మధ్య ఉన్న వివాదాలను పరిష్కరించడంలో కృషి చేశారన్నారు. నెల్లూరు జిల్లాలో బాలబాలికలకు కలెక్టర్ బంగ్లాలోనే పాఠశాలను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటర్ సతీష్ కుమార్, మురళీకృష్ణ, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి మహిళలు రాజకీయాల్లో రాణించాలి

కాచిగూడ: పద్మశాలి మహిళలు రాజకీయాల్లో రాణించాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల పిలుపునిచ్చారు. మంగళవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పద్మశాలి సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మశాలి దసరా మేళాలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం అభినందనీయమని అన్నారు. పద్మశాలి మహిళలను గుర్తించి సీట్లు కేటాయించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూపా, శారద, సంధ్యారాణి, శోభ, వర్ణలీల, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



కృష్ణమూర్తి, కోదండరెడ్డికి మహాత్మాగాంధీ స్ఫూర్తి పురస్కారాలను ప్రదానం చేస్తున్న కోలేటి దామోదర్

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభలో సీల్‌వెల్ సినీ సుస్వరాలు-64 శీర్షికతో సినీ సంగీత విభావరి నిర్వహించారు. సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ, ఆర్‌ఎర్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, స్వాతంత్ర్య సమరయోధుడు ఏటుకూరి కృష్ణమూర్తి అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి మహాత్మాగాంధీ స్ఫూర్తి పురస్కారాలను ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు.

ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గానసభ నిర్వహించిన సినీసంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ప్రముఖ గాయకుడు చంద్రజేత, వర్ధమాన గాయకులు కేవీ రావు, అనూష, కల్యాణి, వెంకీ, శ్రీకాంత్‌లు నాటి, నేటి పాటలను మధురంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు లంకా లక్ష్మీనారాయణ, లోకం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ వైస్‌చైర్మన్‌గా రాజేష్

కాచిగూడ: టీపీసీసీ లీగల్ సెల్ వైస్‌చైర్మన్‌గా హైకోర్టు న్యాయవాది రాజేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు మంగళవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి వర్మ, మొమిన్ రోషన్ జమీర్, భూపాల్, కమలాకర్, కిషన్ రాజ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ శ్రీనివాస్

ముషీరాబాద్: బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ శ్రీనివాస్, రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా మేకల పరశురామ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మంగళవారం వారికి నియామక పత్రాలను అందజేశారు. తమపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన ఆర్.కృష్ణయ్యకు వారు ధన్యవాదాలు తెలిపారు. బీసీల హక్కుల కోసం మరింత పట్టుదలతో కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మ్యారేజ్ బ్యూరో మధ్యవర్తుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: అఖిల భారత గౌడ మ్యారేజ్ బ్యూరో మధ్యవర్తుల సంక్షేమ సంఘం జాతీయ, రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని మంగళవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షుడిగా బుర్రా శ్రీనివాస్‌గౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడిగా సందగళ్ల మధుసూదన్, ప్రధాన కార్యదర్శిగా చంద్రకళ, సహాయ కోశాధికారిగా కె. వెంకటేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా దూసరి వీరస్వామిగౌడ్ తదితరులు ఎన్నికయ్యారు. అతిథులుగా పాల్గొన్న గౌడ ఐక్యసాధన సమితి అంబాల నారాయణగౌడ్ మాట్లాడుతూ... మ్యారేజ్ బ్యూరోల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు.



సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో జాతీయ అధ్యక్షుడు బుర్రా శ్రీనివాస్‌గౌడ్